ఎమ్మెల్యే ఆకేపాటి అక్రమ రిజిస్ట్రేషన్లన్నీ రద్దు

● 39.58 ఎకరాల ప్రభుత్వ భూమి

రాయచోటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన ఎస్టేట్ పేరిట ప్రభుత్వ భూముల్లో చేసుకున్న అక్రమ రిజిస్ట్రేషన్లను శుక్రవారం రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తన స్వగ్రామ సమీపంలో ఆయన పేరిట, ఆయన కుటుంబం పేరిట సుమారు 39.58 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న విషయం విదితమే. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ చేసి ఆకేపాడు సమీపంలో ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్ పేరిట నిర్మించిన నివాస గృహం, వ్యాపార సముదాయాలు ఇతర నిర్మాణాలన్నీ ప్రభుత్వ భూముల్లో నిర్మించినవని, ఇవన్నీ అక్రమ రిజిస్ట్రేషన్లు అని నిర్ధారించి ఈ మేరకు ఆ భూములను ఆన్‌లైన్‌లో వారి పేరిట రద్దు చేసి అవి ప్రభుత్వ భూములుగా మార్చి వేశారు. ఈ భూములకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లను శుక్రవారం రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆయన సతీమణి ఆకేపాటి జ్యోతమ్మ, ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి సతీమణి సుగుణ పేరిట ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు 2023 మే 15వ తేదీ రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులు సహకరించి ఈ రిజిస్ట్రేషన్‌లు చేశారు. వాటన్నింటిని ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి శుక్రవారం ఆ రిజిస్ట్రేషన్‌లు కూడా రద్దు చేయడం సంచలనాత్మకంగా మారింది. ప్రభుత్వ భూమిలో ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి నిర్మించిన అక్రమ కట్టడాలను ఏమి చేస్తారోనన్నది ఆసక్తిగా మారింది.



ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎస్టేట్ భూములు





రథంపై భోళాశంకరుడి వైభోగం

● భారీ ఎత్తున పాల్గొన్న భక్తజనం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాల కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారు రథంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భోళాశంకరుడి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. హత్యరాల శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు రాజంపేట, పెనగలూరు, నందలూరు, పుల్లంపేట, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చారు. రథంపై కొలువుదీరిన త్రేతేశ్వరస్వామిని కనులారా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీసులపై పేకాటరాయుళ్ల దౌర్జన్యం

● 12 మందిపై కేసు నమోదు ● ఆరుగురు అరెస్టు

పీలేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడడమే కాకుండా దానిని అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యం చేసిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. 26వ తేదీన రాత్రి 11 గంటలకు అగ్రహారం పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లె శివాలయం సమీప మామిడి తోటలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ బాలకృష్ణ, ఏఎస్‌ఐ ఉమర్ అలీ, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ, కానిస్టేబుళ్లు ఆనంద్, సతీశ్‌తో కలిసి అక్కడికి వెళ్లారన్నారు. అక్కడ జాజం సుబ్బారావు, భానుప్రకాశ్, ఎస్.సురేంద్ర, వై.రమేశ్ రెడ్డి, ఎస్.రాజారావు, ఎం.మణికంఠేశ్వరరెడ్డి, ఎస్.పండుసారధి, జి.బాబు, ఎం.మన్మోహన్, ఎం.జనార్దన్, రమణ, సుబ్బయ్య, మరికొందరు పేకాట ఆడుతున్నారని, వారి వద్ద ఉన్న 1,70,000 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలినవారి కోసం విచారిస్తుండగా జాజం సుబ్బారావు, అతని కుమారుడు భానుప్రకాశ్, సురేంద్ర పోలీసులపై దాడికి యత్నించారన్నారు. అంతేకాక ఎస్‌ఐ బాలకృష్ణపై రాళ్లు, కర్రలతో దాడి చేయాలని ఇతరులను కూడా ప్రేరేపించాడన్నారు. దీంతో పోలీసులు ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకున్నారని, విషయం తనకు తెలియడంతో సిబ్బందితో హుటాహుటిన వెళ్లి అక్కడే ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కేసు నమోదు చేసిన వారిలో సుబ్బారావు, భానుప్రకాశ్, సురేంద్ర, సోమా నాయక్, రమేశ్ రెడ్డి, మన్మోహన్ రెడ్డిని శుక్రవారం రిమాండుకు తరలించినట్లు వివరించారు.

రెవెన్యూ అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులపై దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడు అంబటి చలపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిందామ్రిపల్లె పంచాయతీ దేవతానగర్ సర్వేనెంబర్ 1029 ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం ఉదయం ఆక్రమణలను తొగించేందుకు ఉపక్రమించారని, ఆ సమయంలో స్థానిక శివాజీనగర్ వాసి అంబటి చలపతి, చంద్రాకాలనీకి చెందిన ప్రదీప్, రమణయ్య రెవెన్యూ అధికారులను దుర్భాషలాడి మారణాయుధాలతో హత్య చేయడానికి ప్రయత్నించారన్నారు. అంతేకాకుండా ఎక్స్‌కవేటర్ అద్దాలను ధ్వంసం చేసి, డ్రైవర్ రెడ్డెప్పపై, ఎక్స్‌కవేటర్‌పై పెట్రోల్ పోసి తగలపెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇందులో అంబటి చలపతి, ప్రదీప్, అతని తండ్రి రమణయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా అంబటి చలపతిని శుక్రవారం మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారి తట్టివారిపల్లె నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడి నుంచి ఒక కొడవలి, ఖాళీ పెట్రోలు క్యాను, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ, రూరల్ సీఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తరిగొండ రోడ్డులోని ఏపీ మైనార్టీ బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయురాలిపై పాఠశాల చైర్మన్ ఆయేషా, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం సీఐ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో బాలికలు గొడవ పడ్డారని, ఆ విషయంపై విద్యార్థినులను వారించాల్సిందిపోయి ఉపాధ్యాయురాలు వారిని పిలిపించి ఖురాన్‌పై ప్రమాణం చేయాలని బలవంతం చేసిందన్నారు. అంతేకాక ఓ బాలిక తన వ్యక్తిగత కారణం చేత ప్రమాణం చేయనని చెబితే వినకుండా ఖురాన్ కూడా ఒక పుస్తకమేనని, ప్రమాణం చేయడం ఇబ్బంది కాదని మాట్లాడిందని వాపోయారు. కొంత కాలంగా పాఠశాలలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే వస్తోందని, మత విశ్వాసం దెబ్బతినేలా మాట్లాడడం బాధాకరమన్నారు. దీనిపై విచారణ జరిపి భవిష్యత్తులో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని పురుగుల మందు తాగి బాలిక మృతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లాలని తల్లిదండ్రులు మందలించినందుకు బాలిక పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని ఎస్.కొత్తపల్లెకు చెందిన నాగరాజు తోటకు శ్రీనువాసులు, వెంకటమ్మలు కొంతకాలంగా కాపలా ఉంటున్నారు. వీరి కుమార్తె తుపాకుల వెంకటమ్మ ఏడో తరగతి చదువుతోంది. బడికి వెళ్లలేదని తల్లిదండ్రులు మందిలించినందుకు తోటలో ఉన్న పురుగుల మందును ఈనెల 24వ తేదీన తాగింది. హుటాహుటిన తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ పుష్ప తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రాజంపేటలో ఐదు ఇళ్లల్లో దొంగల బీభత్సం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డు అక్షర స్కూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఐదు ఇళ్లల్లో దొంగలు బీభత్సం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 1.30 నుంచి 3 గంటల మధ్య మాస్కులు ధరించి ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులంతా కుంభమేళాకు వెళ్లడంతో ఇదే అదునుగా దొంగతనానికి పాల్పడ్డారు. మేడా సుబ్బారెడ్డి, రమణారెడ్డి, కార్తీక్, శ్రీనివాసుల నాయుడు ఇళ్లతో పాటు మరో ఇంటిలోకి వీరు మాస్కులు ధరించి ప్రవేశించారు. మేడా సుబ్బారెడ్డి ఇంటి మెయిన్‌డోర్‌ను పగులగొట్టి బెడ్‌రూంలోకి ప్రవేశించి 80 వేల నగదు, కొంత బంగారాన్ని అపహరించారు. అయితే మిగిలినవారి ఇళ్లల్లోకి ప్రవేశించినా వారి ఇళ్లల్లో కొందరు కుటుంబసభ్యులు ఉండడంతో దుండగులు వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి సంఘటనపై విచారణ చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. ఇద్దరు మాస్కులు ధరించి స్కూటర్‌లో రెక్కీ నిర్వహించి, మిగిలినవారు ఇళ్ల వెనుకవైపు నుంచి ప్రవేశించినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బెడ్‌రూంలోని వస్తువులను చెల్లాచెదురు చేసిన దొంగలు

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ... హాజరైన విద్యార్థులు, తదితరులు





ఏకాగ్రత ఉంటే చదువులో రాణించగలరు

● పిల్లలు సెల్‌ఫోన్ కు దూరంగా ఉంటే ఏదైనా సాధించ వచ్చు ● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఏకాగ్రత ఉంటే చదువులో రాణించగలరని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. రైల్వేకోడూరు విజయా కన్వెన్షన్ లో అపుస్మా ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థునులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీబీఐ మాజీ జేడీ మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకమైన విషయాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కూడా పాటుపడాలన్నారు. శ్రీనివాసరామానుజం చిన్న వయస్సులోనే తన తెలివితేటలను ప్రదర్శించారన్నారని గుర్తు చేశారు. ప్రశ్నపత్రాలు విద్యార్థులను చూసి భయపడాలే గాని ప్రశ్నపత్రాలను చూసి విద్యార్థులు భయపడకూడదన్నారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ పక్కన పెట్టాలన్నారు. పిల్లలకు సినిమా డైలాగులు గుర్తుంటాయని, చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నతమైన స్థానాలకు చేరుకోవచ్చునని తెలిపారు. బాగా పఠనం చేసి పరీక్షలు రాయాలని, రైల్వేకోడూరు పేరు నిలబెట్టాలన్నారు. షటిల్ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వివాహానికి తాను వెళ్లాలని తెలిపారు. ఒలంపిక్స్‌లో రెండుసార్లు ఇండియాకు బహుమతులు ఎలా సాధించారని పీవీ సింధును అడిగానని, ఇందుకు ఆమె తాను నాలుగు నెలల పాటు సెల్‌ఫోన్ పట్టుకోకుండా లాకర్ వేసి, తనకు ఇష్టమైన ఐస్‌క్రీంను వదులుకుని ఏకాగ్రతతో సాధన చేశానని తెలిపిందన్నారు. అమ్మ చేతికి కత్తి ఇస్తే కూరగాయలు కోస్తుందని, అదే కత్తి వైద్యుడికి ఇస్తే సర్జరీ చేస్తారని, క్రిమినల్ చేతికి ఇస్తే చంపుతాడని అభివర్ణించారు. అబ్దుల్ కలాం తన తండ్రి బోటును తయారు చేస్తుండగా చూసి భారతదేశానికి మిసైల్స్ తయారు చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఏకాగ్రతతో చదివి పరీక్షలు రాయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించకుంటే.. హంద్రీ-నీవా పనులు జరగనివ్వం

● హంద్రీ-నీవా కాల్వలో ఎండ్లపల్లె గ్రామస్థుల నిరసన

ములకలచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ మీదుగా తమ పొలాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించాలని, లేకుంటే కాంక్రీట్ లైనింగ్ పనులను అడ్డుకుంటామని ఎండ్లపల్లె గ్రామస్థులు తేల్చి చెప్పారు. ఈ మేరకు వారు హంద్రీ-నీవా కాలువలోకి దిగి నిరసన తెలిపారు. ఆ వివరాల్లోకి వెళితే.. ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ ఎండ్లపల్లె వద్ద హంద్రీ - నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎండ్లపల్లె వద్ద జరుగుతున్న పనులతో తమ గ్రామంతో పాటు కొండపల్లె రైతులకు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతుందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. హంద్రీ-నీవా కాలువ తవ్వకాల సందర్భంగా 15 ఏళ్ల క్రితమే తమ పొలాలకు వెళ్లే విధంగా వంతెన నిర్మించాలని కోరినా పట్టించుకోకుండా పనులు చేపట్టారన్నారు. అప్పటి నుంచి కాలువలోనే దారి ఏర్పరచుకుని రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ కాంక్రీట్ లైనింగ్ పనులు జరగాలంటే వంతెన నిర్మించాలన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటరమణారెడ్డి, భాస్కర్, మల్లికార్జున, శంకర, గోపాలకృష్ణ, చరణ్, దేవమ్మ, అనసూయమ్మ, శ్రీలక్ష్మి, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



హంద్రీ-నీవా కాలువలో నిరసన తెలుపుతున్న ఎండ్లపల్లె గ్రామస్థులు

నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలకండి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

పెద్దమండ్యం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలకాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పిలుపునిచ్చారు. పెద్దమండ్యం మండలం రామానాయక్ తాండా పంచాయతీ బండకింద తాండాలో శుక్రవారం నవోదయం 2.0, నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దురలవాట్ల నుండి బయటపడి పిల్లల ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మంచి భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తాండా వాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సీఐలు మాధవి, లక్ష్మన్న, సర్పంచ్ శిరీష, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎస్‌ఐలు బాబు, రమణ. సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

జాతరకు చేరుకున్న గొల్లపల్లె గంగమ్మతల్లి



గొల్లపల్లె నుంచి గంగమ్మ జాతరకు వెళుతున్న అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరకు ముందురోజున అమ్మవారి పుట్టినిల్లు అయిన చెల్లు వంశీయుల ఇంటి నుంచి శుక్రవారం రాత్రి అమ్మవారు బయలుదేరింది. చెల్లు వంశీయులైన అర్చకులు గంగరాజు, జగదీష్ అమ్మవారికి పట్టువస్త్రాలు, గొడుగులు, కేరళ కళాకారుల డప్పు వాయిద్యాలు, బాణాసంచాలతో రాచపల్లె నుంచి గొల్లపల్లెకు చేరుకున్నది. అక్కడ అమ్మవారిని అలంకరించి జాతరకు తీసుకువచ్చారు. దీంతో గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. జాతర భక్తులు పోటెత్తారు. రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్ మోహన్, ,మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్ర పోలీసులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండికిరీటం

సుమారు లక్ష రూపాయల విలువ చేసే వెండి కిరీటం, శూలం, హస్తాలను చక్రాయపేట మండలం దేవరగుట్టపల్లె మాజీ సర్పంచు సుబ్బరామయ్య శుక్రవారం ఆలయ ఈవో శ్రీనివాసులుకు అందజేశారు. ముందుగా అమ్మ వారికి సుబ్బరామయ్య కుటుంబీకులు పూజలు చేశారు.



వెండి కిరీటం అందిస్తున్న సుబ్బరామయ్య

గంగమ్మజాతర ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మజాతర జాతర ఏర్పాట్లను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు శు క్రవారం పరిశీలించారు. ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్ సౌ కర్యాలపై ఆరా తీశారు. 24 గంటలూ విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. 25 ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందజేయాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌పై సూచనలు ఇచ్చారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓకు సూచించారు.

వక్ఫ్ భూముల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

● ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వక్ఫ్ భూముల పరిరక్షణ బాధ్యత ప్రభు త్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జామియా మసీదులో ప్రార్థనల అనంతరం బెంగళూరు బస్టాండులో ముస్లింలతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టప్రకారం వక్ఫ్ భూములను దొంగ రిజిస్టర్లు చేయించుకున్న వారిపై చర్యలుంటాయన్నారు. పట్టణంలోని సర్వే నెంబర్ 130, 144 లలో సబ్ డివిజన్ కాలేదని తహసీల్దార్ సర్టిఫికెట్ ఇచ్చారని, ఈ ఆస్తులు ఎవరిపేరుతో ట్రాన్స్‌ఫర్ కావన్నారు. 1962 గెజిట్‌ప్రకారం ఈ భూములన్నీ దేవదాయ వక్ఫ్ భూములేనన్నారు. కొందరు ఈ భూముల్లోకి వెళ్లి వివాదాలు సృష్టించారని, వీరిపై చట్టం ప్రకారం చర్యలు వుంటాయన్నారు. తనపై కొందరు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు జామియా మసీదు వక్ఫ్ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సికిందర్ అలీఖాన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు గౌస్ మొహియుద్దీన్, అబూబకర్, అక్బర్‌బాషా, సాజిద్‌అలీ, సర్దార్ ఖాన్, గౌస్, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ స్థాపనతోనే వికసిత్ భారత్ సాధ్యం

● జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ స్థాపనతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశోధనల వైపు అడుగులు వేయాలన్నారు. తాము ఎంచుకున్న రంగానికి సంబంధించిన నైపుణ్యాలను విద్యార్థులు తప్పనిసరిగా సాధించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య మాట్లాడుతూ మన పాఠశాలలో ఉన్న వివిధ ప్రయోగశాలలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే విద్యార్థుల జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రామయ్య, రవిశంకర్, ఉమాదేవి, రెడ్డెయ్యరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి ఏజీపీగా గడ్డం రవికుమార్

కలికిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) ఏజీపీగా గడ్డం రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ కోర్టులో సివిల్ కేసులను పర్యవేక్షించనున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన జయశేఖర్

ములకలచెరువు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య-శ్రీ సత్యసాయి జిల్లాల సరిహద్దు సమీపంలో ములకలచెరువు వాసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తనకల్లు పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు నివాసి జయకర్ (41) అలియాస్ నామాలు జిల్లా సరిహద్దులోని తనకల్లు మండలం చీకటిమానిపల్లె వద్ద శుక్రవారం ఉదయం శవమై కన్పించాడు. శరీరంపై గాయాలు ఉండడంతో ఎవరైనా హత్య చేశారేమోనని ములకలచెరువు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని తనకల్లు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

● పరిశోధనలతోనే వెలుగులోకి వాస్తవాలు ● డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధించాలంటే యువత శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష, విద్యాశాఖాధికారుల పిలుపు మేరకు శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. వాస్తవాలు వెలుగుచూడని అనేక అంశాలు ఉన్నాయని, వాటిపై విద్యార్థులు పరిశోధనలు చేయాలన్నారు. రాయచోటి ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాలను నిర్దేశించుకుని వాటిని సాధించేటట్లు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వికసిత్ భారత్ కోసం విద్యార్థులకు క్విజ్, సెమినార్ పోటీలను నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు.



జాతీయ సైన్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

వేమయ్యా.. నీది కొబ్బరి చెట్టంత మనసయ్యా..!





ఆయన ఓ పర్యావరణ ప్రేమికుడు. పశువులు, పక్షులు, మొక్కలంటే ఎంతో ఇష్టం. ఎంతంటే.. తన ఇంటిని ఏకంగా చీల్చి ఓ కొబ్బరి చెట్టు కోసం వదిలేసేంత. ఆయనే కడపకు చెందిన రామాపురం వేమయ్య. ఇంతకీ ఆయన ఏం చేశారో తెలుసుకుందామా..!

ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రామాపురం వేమయ్య. కడప నగర 9వ డివిజన్ సాయిపేటలో చిన్న పూరిల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఒక కొబ్బరి మొక్కను నాటారు. అది కాస్తా పెరిగి పెద్దదైంది. కొంత కాలానికి ఈయనకు పక్కాగృహం మంజూరు కావడంతో.. చెట్టుపై ఉన్న ప్రేమను తుంచుకోలేక ఇంట్లోనే ఓ భాగంగా పై కప్పుకు రంధ్రం వేసి వదిలేశారు. ఇప్పుడు ఆ చెట్టుకు ప్రతి సీజన్లో 300 -400 కొబ్బరికాయల కాపు వస్తున్నాయి. లాభం ఆశించకుండా అడిగిన వారికి ఉచితంగా ఇస్తున్నారు. అంతేకాకుండా పశుపక్షాదులను ప్రేమిస్తూ పిల్లలు లేని లోటు తీర్చుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప





చెట్టుకు విరివిగా కాసిన కాయలు



ఇంటికి రంధ్రం వేసిన దృశ్యం



ఇంట్లో కలిసిపోయిన కొబ్బరిచెట్టు

డివైడర్‌ను ఢీకొన్న బైకు ఇరువురికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేలోని చింతకుంట సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున గాలేరు-నగిరి కాల్వపై నున్న బ్రిడ్జి డివైడర్‌ను బైకు ఢీకొన్న సంఘటనలో ఇరువురు యువకులకు గాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన గౌస్‌బాషా, సుభాన్ బాషా బైకుపై తాడిపత్రి వైపు వెళుతున్నారు. మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అత్యాచార నిందితుడికి మూడేళ్ల జైలు

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిరెడ్డిపల్లెలో ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడిన గొల్లపల్లె శివనారాయణకు కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. 2023 జూన్ 27న మతిస్థిమితం లేని మహిళపై శివనారాయణ అత్యాచారం చేశాడు. ఆమె భర్త వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు అప్పగించారు. శుక్రవారం కడప మహిళా కోర్టు మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ చేపట్టి నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

ఖాజీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని బుడ్డాయపల్లె వద్ద ఆవుల లలితమ్మ మెడలో బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు రోజు దినచర్యలో భాగంగా కూలి పనులకు వెళ్లి తిరిగి వచ్చి పేరారెడ్డి కొట్టాలు వద్ద రోడ్డుపై గ్రామ మహిళలందరు దిగారు. లలితమ్మ గృహం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో నడుచుకుంటూ వెళుతుండగా స్కూటర్‌పై ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ ధరించి వచ్చి కర్నూలుకు ఎటు వెళ్లాలమ్మా అని అడుగడంతో ఇదే దారిన వెళ్లండి అని చెప్పి ఆమె వెనుతిరిగింది. ఆ వెంటనే స్కూటర్‌పై ఉన్న రెండవ వ్యక్తి ఆమె మెడలోని గొలుసు లాక్కుని వెళ్లిపోయారు. బంగారం గొలుసు 35 గ్రాములు ఉందని... పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

జూదరుల అరెస్టు

చాపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురూరు గ్రామం వద్ద ఉన్న పెన్నానదిలో కంపచెట్ల మధ్య పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,800 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని ప్రాధాన్యత అంశాలలో వైఎస్సార్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచి వాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, వేసవిలో తాగునీటి సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులతో కలసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లాలోని అన్ని మున్సిపల్ అధికారులు ఎంపీడీవోలతో కలెక్టర్ వీసీ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా లబ్ధి మొత్తాన్ని పంపిణీ చేసే సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించాలన్నారు. పెన్షనర్ల దగ్గర డబ్బులు వసూలు చేయరాదని సిబ్బందిని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని... వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో జరుగుతున్న పి-4 సర్వేను మార్చి 2వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. వివిధ సంస్థల్లో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న జిల్లాకు చెంది ఉద్యోగుల డేటాను సర్వేను పారదర్శకంగా ఖచ్చితంగా నిర్వహించాలని డీఎస్ డబ్ల్యూఎస్ సిబ్బం దిని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనరు మనోజ్‌కుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సీపీవో హజరత్తయ్య, డీపీఓ రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు ఆనంద్‌నాయక్, కిరణ్ కుమార్, అన్ని మండలాలు, మున్సిపాలిటీ కమి షనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సం

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం వీరబ్రహేంద్రస్వామి సమేత గోవిందమాంబల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారిమఠంలో స్వామి నివాస గృహం నుంచి గ్రామ పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఉరేగింపు నిర్వహించారు. కాగా, ఇటీవల కల్యాణ మహోత్సవాలకు భక్తులు తరలివచ్చి స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కిం చగా సుమారు రూ.53,529లు దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ పిట్‌పర్సన్ శంకర్‌బాలజీ తెలిపారు.

అలాగే శుక్రవారం తెల్లవారుజామున ఈశ్వరీదేవికి పురవీధుల్లో సింహ వాహనంపై ఉరేగింపు నిర్వహించారు. మహా నైవేద్యంతో మహాశివరాత్రి ఉత్సవ వేడుకలు ముగి సినట్లు మఠాధిపతులు వీరశివకుమార్ స్వామి తెలిపారు. గ్రామోత్స వంలో దేవస్థానం సిబ్బంది గోపాల్, పరిపూర్ణాచారి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో గోవిందమాంబ సమేత వీరబ్రహేంద్రస్వామి

ఏపీకార్ల్‌లో అమెరికన్ కంపెనీ బృందం పర్యటన



పులివెందుల ఏపీకార్ల్‌లో అమెరికన్ బృందం పరిశీలన

పులివెందుల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీకార్ల్‌లో మ్యాక్స్‌వెల్ బయో సైన్సెస్ బృందం శుక్రవారం పర్యటించింది. ఏపీలో కొత్త కంపెనీలను స్థాపించడంలో భాగంగా తమ కంపెనీని స్థాపించడానికి సంబంధించి కంపెనీకి చెందిన ప్రవీణ్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పర్యటించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి అడ్వైజర్ డాక్టర్ విరామ్‌నాథ్, మ్యాక్స్‌వెల్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌రెడ్డి, సీఈఓ రిథమ్‌సోధి, ఎంఎస్‌ఎమ్ఈ ప్రిన్సిపుల్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎంఎస్ శంకరప్రసాద్, ఏపీకార్ల్ సీఈఓ శ్రీనివాసప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి మహా శివరాత్రి ఆదాయం రూ.73,97,613

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో గల (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మల మడుగు, బద్వేలు, పులివెందుల) డిపోల ద్వారా 253 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటి ద్వారా ఆర్టీసీకి రూ.73,97,613 ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ కడప ఆర్ఎం గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసి ఆదాయం సమకూర్చిన భక్తులకు, సహకరించిన పోలీసు సిబ్బందికి, ప్రత్యేకించి ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : జేసీ

సింహాద్రిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అర్జీలు త్వరిత గతిన పరిష్కరించాలని.. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి.. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పీజీఆర్ఎస్, గ్రామ రెవెన్యూ అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కాలయాపన జరుగకుండా చూడాలని ఆదేశించారు. భూ రీసర్వేలో రైతుల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డీఐ హేమలత, తహశీల్దార్ నాగేశ్వర్‌రావు, డీటీ హరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి

వేంపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులు పట్టుదలతో ఉన్నతచదువులు చదివి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని చిత్తూరు జాతీ య వాతావరణశాఖ శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో జాతీయ సైన్స్ దినోత్సవం, అభియంత్‌ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కొత్తకొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయాలని, ప్రయోగాలు సక్సెస్ అయితే అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతలు సాధిస్తారని ఆయన తెలిపారు. గ్లోబల్ లీడర్‌షిప్, వికసిత్‌భారత్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ గురించి విద్యార్థులకు సవివరంగా తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి చదును... రెండు వాహనాలు సీజ్

పెండ్లిమర్రి;ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1లో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న రెండు వాహనాలను శుక్రవారం సీజ్ చేసినట్లు తహశీల్దార్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారన్న సమాచారం రాడంతో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో వెంకట సుబ్బయ్యలను అక్కడికి పంపడం జరిగిందన్నారు. అలాగే ఎస్సై మధు సూదన్ రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని భూమిని చదును చేస్తున్న ఒక హిటాచి, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారన్నారు.

శిల్పారామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం..



శిల్పారామాన్ని సందర్శిస్తున్న స్వామి నాయుడు

కడప కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శిల్పా రామాన్ని మరింతగా అభివృద్ధి పరుస్తామని శిల్పారామాల రాష్ట్ర ప్రధాన పరిపాలనాధికారి వి.స్వామినాయుడ స్పష్టం చేశారు. నగర రిమ్స్ సమీపంలో గల శిల్పా రామాన్ని శుక్రవారం ఉదయం ఆయన సందర్శించారు. అక్కడ బోటింగ్, బోట్స్ స్థితిగతులను కడప శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బోటింగ్ ఐలాండ్ చుట్టూ బోగానుపూల మొక్కలను, సందర్శకులు వచ్చి కూర్చునేలా సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా మెయిన్ గేట్ ఎంట్రన్స్ నుంచి ఆంపియా థియేటర్ వరకు రోడ్డు కిరువైపులా పూల మొక్కలను నాటించాలని ఆదేశించారు. నాటిన మొక్కలకు వాటర్ డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయాలని.. ఇందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేయిస్తామని తెలిపారు.

ప్రభుత్వ సాయంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయం అందిపుచ్చుకొని లబ్ధిపొందిన ప్రతి ఒక్కరు ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనమాట్లాడుతూ పేదలు మధ్య తరగతి కుటుంబాలు మెరుగైన జీవనోపాధులు పొందేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ఈక్రమంలో సంక్షేమ ఫలాలు పొందిన వారు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఈఎం జగన్నాథం, మత్స్యశాఖ డీడీ శాంతి, నాబార్డు డీడీఎం విజయవిహారి, పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

● కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉక్కాయపల్లె నిర్మలా ఫార్మసీ కళాశాలకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి యాజీసీ అటానమస్ హోదా లభించిందని ఆ కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ యు.మోహన్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్మలా కళాశాలలో 24 ఏళ్ల నుంచి ఉన్నతమైన విలువలు, ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. విద్యార్థులను ఫార్మసీ రంగంలో సాంకేతికంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రతి ఏడాది ప్రాంగణ ఎంపికల ద్వారా అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు.

తగ్గేదేలే...

● స్టైఫండ్ పెంచేవరకు పోరాటమే..

● ప్రభుత్వ పశువైద్య విద్యార్థుల ఆందోళన

● 26వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర ఏళ్లపాటు పశువైద్య విద్యను అభ్యసించి తర్వాత 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ కోర్సు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి ఆరు నెలలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో.. మరో ఆరు నెలలు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్న్‌షిప్‌కోర్సు పూర్తి చేయాలి. ఈ సమయంలో ప్రభుత్వం నెలకు కేవలం రూ.7వేలు చెల్లిస్తోంది. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చెల్లించే స్టైఫండ్ తమ ఖర్చులకు సరిపోవడం లేదంటూ... తరగతులు బహిష్కరించి నిరసన బాట పట్టారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ గోడు వెల్లబోసుకున్నా ఫలితం లేదని... ప్రభుత్వం స్టైఫండ్ పెంచుతూ జీవోను విడుదల అయ్యేవరకు సమ్మెను కొనసాగిస్తాం.. తెగేసి చెబుతున్నారు. ఈ నేప ధ్యంలో పశువైద్య విద్యార్థులు చేపడుతున్న ఆందో ళన 26వ రోజుకు చేరుకుంది. వివరాల్లోకి వెళితే..

తిరుపతి వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో తిరుపతి, ప్రొద్దుటూరు, గరివిడి, గన్నవరం ప్రాంతాల్లో ప్రభుత్వ పశువైద్య కళాశాలలు నడుస్తున్నాయి. వీటిలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 400 మంది ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. 2013లో పశువైద్యకళాశాల విద్యార్థులకు, వైద్య రంగ విద్యార్థులకు సమానంగా స్టైఫండ్ రూ.7వేలు ప్రభుత్వం చెల్లించేది. వైద్య రంగం (ఎన్‌బీబీఎస్) విద్యార్థులకు ఏటా స్టైఫండ్‌ను పెంచుతూ ప్రస్తుతం వారికి రూ.25,300 చెల్లిస్తున్నారు. పశువైద్య విద్యార్థులకు మాత్రం 2013 నుంచి నేటి వరకు రూ.7వేలు మాత్రమే స్టైఫండ్‌గా ఇస్తున్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపధ్యంలో బయటి ప్రాంతాల్లో విధులు నిర్వహించడానికి రూము అద్దె, భోజన వసతి, రవాణా ఖర్చులకు ఈ రూ.7వేలు ఏమూలకు సరిపోతాయన్నది ఈ విద్యార్థుల వాదన.



కళాశాల ఆవరణలో 26వ రోజు సమ్మెలో పాల్గొన్న విద్యార్థులు

ఇతర రాష్ట్రాలలో...

పశువైద్య విద్యార్థులకు కర్ణాటక, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో రూ.23వేలు, బీహార్‌లో రూ.24 వేలు, ఒరిస్సాలో రూ.22 వేలు, యూపీలో రూ.23,500, తమిళనాడు, హర్యాణా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో రూ.25వేలు ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రూ.7 వేలు ఇవ్వడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు విన్నపం

స్టైఫండ్ పెంచాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, అచ్చెంనాయుడుతో పాటు ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను వివరించామన్నారు. ప్రతి ఒక్కరు మౌకికంగా హామిలిచ్చి కాలయాపన చేస్తున్నారే కానీ స్పష్టమైన ఆదేశాలు కరువయ్యాయన్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారని వివరించారు.

జీవో విడుదల చేయాలి

- రోషిత్‌కుమార్, విద్యార్థి



పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలి. ఉపకార వేతనం పెంచకపోతే ఆందోళన విరమించేది లేదు.

మానవత్వంతో ఆలోచించాలి

- వి.రజిత, విద్యార్థిని



న్యాయపరమైన సమస్యపై పోరాటం చేస్తున్నాం. వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ అందించాలని మాత్రమే కోరుతున్నాం. గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదు.

తల్లిదండ్రులపై ఆధారం

- శరణ్య, విద్యార్థిని



ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కనీస అవసరాలకు సరిపోదు. ఇప్పటికి కూడా తల్లి దండ్రులపై ఆధారపడటం బాధగా ఉంది. పశువైద్య విద్యార్థులంటే ఎందుకంత అలుసు.

ఆలయ పూజారిపై ఫిర్యాదు

వీరబల్లి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువరాజుపల్లి పంచాయతీలో వెలిసిన అరేబాంబిక ఆలయ పూజారిపై గ్రామస్థులు శుక్రవారం రాయచోటి ఎండోమెంట్ ఆఫీ్‌లో దేవాదాయ శాఖ ఈవో విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. విధులు సక్రమంగా నిర్వహించలేదని పేర్కొన్నారు. తమ సొంత పనులకు ఎక్కువగా సమయం కేటాయిస్తూ గుడి నిర్వహణను పట్టించుకోలేదన్నారు. అంతేగాకుండా గుడి విషయాలపై సొంత నిర్ణయం తీసుకుంటూ సమయానికి ఆలయంలో పూజలు నిర్వహించకుండా తనకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పూజారిపై తగు చర్యలు తీసుకొని ఆలయంలో సక్రమంగా పూజా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

వైభవోపేతం వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల బృందంచే వేదమంత్రోచ్చారణల మధ్య వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం చండీ హోమాన్ని నిర్వహించారు.


వీరభద్రాలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

సిద్దవటం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఉపాధిహామీ ఏపీవో నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి అధికారిణి ఫణిరాజకుమారి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 2023-24 సంవత్సరంలో హౌసింగ్ బిల్లుల్లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏడు రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ రికవరీ డబ్బు విజయవాడ సీఆర్‌డీ కమిషనర్‌కు చెల్లించి కడప ఉపాధి హామీ పీడీకి సంజాయిషీ ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన సూచించారు.

మంత్రి చొరవతో 40 ఏళ్ల దారి సమస్యకు పరిష్కారం

● సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

సంబేపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మం డలం నారాయణరెడ్డిపల్లె గ్రామం కొండావాండ్లపల్లె బీసీ కాలనీలో 40 ఏళ్ల నాటి దారి సమస్య రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో పరిష్కారమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు రేపన శివప్రసాద్ తెలిపారు. రోడ్డు ఆక్రమణ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయించారన్నారు. రోడ్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.


బీసీ కాలనీకి సిమెంటు రోడ్డు వేసిన దృశ్యం

రోడ్డును తనిఖీ చేసిన ఎంపీడీవో

పెనగలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణనెల్లూరు ఎస్టీకాలనీలోని మట్టిరోడ్డును శుక్రవారం ఎంపీడీవో ఎస్.విజయరావు, సీఆర్ ఏఈ గంగులయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో పాటు నారాయణనెల్లూరు గ్రామ పెద్దలతో ఆయన మాట్లాడారు. త్వరలో సిమెంటురోడ్డు నిర్మాణం చేపడతామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చెట్ల నరికివేత

సుండుపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీ గడ్డమీదపల్లిలో మూతబడిన ప్రభుత్వ బడిలో చెట్లను నరికిన విషయం స్థానికుల ప్రమేయంతో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తైలం, టేకు చెట్లను అమ్మినట్లు వారు తెలిపారు.
సుమారు 15 నుంచి 20 సంవత్సరాల గ్రామ కంఠం భూమిలోని చెట్లను సైతం నరికారని, వారిపైన చర్యలు తీసకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా రెవెన్యూ, ఫారెస్ట్, విద్యాశాఖ అధికారులు గడ్డమీదపల్లి ప్రభుత్వ బడిని పరిశీలించారు.


నరికిన చెట్ల మొద్దులు

'పేషెంట్లకు స్టీలు కుర్చీలు ఏర్పాటు చేస్తాం'

సిద్దవటం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పేషంట్లకు స్టీలు కుర్చీలను ఏర్పాటు చేస్తామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి అదనంగా మూడు సీసీ కెమెరాలు, ఆరోగ్యమిత్ర కౌంటర్‌కు గ్రాస్ కటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆసుపత్రి ఆవరణంలో మొక్కలు నాటిస్తామన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.


డాక్టర్ ప్రకాష్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఎంఈవో

సంబేపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పరీక్షల సామగ్రిని అందించారు.

భూకబ్జాలు అరికట్టాలి

సిద్దవటం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):శాఖరాజుపల్లె రెవెన్యూ ఉప్పరపల్లె గ్రామంలో భూ కబ్జాలను అరికట్టాలని ఇన్‌చార్జి మండల తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. పాత మాధవరం నివాసులకు 1994లో అప్పటి కలెక్టర్ రమణాచారి సర్వేనంబరు 424/2 నందు 119 మందికి ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేశారని, కొందరు ఆ క్రమించాలని యత్నిస్తున్నారన్నారు.

ఘనంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించారు. విడ్స్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులు, తపాలాశాఖలను వినియోగించుకోవాలన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి: కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి):వచ్చే వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరా,వ్యాధుల వ్యాప్తి, ఎమ్మెస్ ఎంఈ సర్వే తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. డీఆర్‌వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, పీడీడీఆర్‌డీఏ, పీడీఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ, అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): సామాన్యుల సంక్షేమమే సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గం పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీల అమలు కోసం సూపర్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కూనా మురళి, సంతోశ్, నాగరాజ, రౌఫా, హైదర్, రఫీ, అమీర్‌బాషా, షరీఫ్, హబీబ్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

బడ్జెట్‌లో మైనార్టీలకు అగ్రస్థానం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు, అల్ప సంఖ్యాక వర్గాలవారికి పెద్దపీట వేశారని రాష్ట్ర మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు జి.గుల్జార్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాజంపేటలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏకంగా మైనార్టీలకు, అల్పసంఖ్యాకవర్గాలవారికి రూ.5434 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు.పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మంత్రివర్గ నిర్ణయం తక్షణమే మానుకోవాలి

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనిని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని మంత్రి వర్గం చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వర్రి సురేశ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వర్రి సురేశ్‌కుమార్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌నాయక్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్రమ్మ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడారు.

ఘనంగా జాతీయ సైన్స్‌డే


బహుమతులు అందజేసిన అభిషేక్‌రెడ్డి... ప్రాజెక్టులను పరిశీలిస్తున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్‌డేని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో ఆ పాఠశాల కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఈ వేడుకలను ప్రారంభించారు. రాజు విద్యాలయంలో సైన్స్ ఫెయిర్ వేడుకలను సీఈవో రఘురామరాజు, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి ప్రారంభించారు.
అన్నమాచార్యలో... అన్నమాచార్య యూనివర్సిటీలో జాతీయ సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీ ప్రో చాన్సలర్ అభిషేక్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఎల్.ఓబుళపతిలు పాల్గొన్నారు. సుమారు 67 మంది విద్యార్థులు సైన్స్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అభిషేక్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

గురునాధీశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం

పెనగలూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గురునాధీశ్వర ఆలయంలో కంబాలకుంట బీసీకాలనికి చెందిన సింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మారంరెడ్డి, ఈశ్వరమ్మ, లక్ష్మీనరసయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి మారంరెడ్డి శివకుమార్, వీహెచ్‌పీ సభ్యులు ఎం.నరసింహా, ఎం.మణికుంఠ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఐటీయూ పరామర్శ


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంటాలు ఎంతో బాధతో ఉంటాయన్నారు. ప్రభుత్వం మృతులకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి రూ.30 వేలు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. అటవీశాఖాధికారులు అడవిలో ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదన్నారు.

గ్రామీణులకు వైద్యం అందించడంలో సంతృప్తి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణులకు వైద్యం అందించడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని చెస్ట్ స్పెషలిస్టు మలిశెట్టి శైలజ అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆమె తన శిక్షణా కాలాన్ని పూర్తి చేశారు.


గ్రామీణ మహిళకు వైద్యం అందిస్తున్న మలిశెట్టి వైష్ణవి

సుమారు 3 నెలల పాటు ఆమె జిల్లా రెసిడెన్సీ ప్రోగ్రాం కింద గ్రామీణులకు వైద్య సేవలు అందించారు. ఆమె తిరుపతి పద్మావతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివారు. తర్వాత పల్మనాలజీలో ఎండీ పూర్తి చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రధాన వైద్యురాలు బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేశారు.

చెన్నకేశవా.. చింత తీర్చవా..

సుండుపల్లె, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ ఉప్పరపల్లి సమీపంలో వెలిసిన చెన్నకేశవస్వామి తిరుణాల శుక్రవారం ఘనంగా ముగిసింది. రెండు రోజుల నుంచి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు దర్శనమిచ్చాయి. మొక్కుబడులు ఉన్న 8 కుటుంబాలు చాందినీ బండ్లు కట్టారు. 'చెన్నకేశవా.. చింత తీర్చవా..' అంటూ స్వామివారిని మొక్కుకున్నారు.


చెన్నకేశవస్వామి ఆలయంలో రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలో చాందినీ బండి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఇందు కోసం రైల్వేకోడూరులో సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే పశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల కస్టోడియన్ చమర్తి శారద శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీ జూన్‌యర్ కళాశాల, వశిష్ట జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1550 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుంది కాబట్టి ఎవరూ అక్కడ ఉండకూడదన్నారు. కాపీలు వేయడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఉర్దూ పాఠశాల పని వేళలు మార్చండి'

రామాపురం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఉర్దూ పాఠశాలలో పనివేళలు మార్చాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రగతిశీల ఉపాధ్యక్షుల సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం ఉపాధ్యాయులకు అనుకూలంగా పాఠశాల పని వేళలు మార్చాలని కోరారు. ఈ సమయంలో ఉపవాసాలు ఉంటారని, ఉదయం ఒక పూటబడి నిర్వహించాలని, పాఠశాల ఉదయం 8 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతి ఇవ్వాలని కోరారు.

మాలేపెద్దయ్య స్వామికి పూజలు

చిన్నమండెం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి గ్రామ ఇలవేల్పు దేవుడైన మాలేపెద్దయ్య (దేవరెద్దు) స్వామి తిరుణాల శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం తెల్లవారుజామున చింతోళ్లమాలి నుంచి మంగళ వాయిద్యాలతో సాంప్రదాయబద్ధంగా బయలుదేరి కుర్వపల్లి మీదుగా ఇంటింటి పూజలు అందుకుంటూ దేవర ఇంటికి చేరుకుంది. పూజల అనంతరం బాపూజీనగర్‌కాలనీ మీదుగా జల్లావాండ్లపల్లెకు చేరుకుంది. దేవరెద్దు వెళ్లిన దారి వెంబడి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

జాక్‌పాట్ నిర్వహిస్తే కఠిన చర్యలు

- నూతన కార్యవర్గానికి అల్టిమేటం


సమావేశంలో సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోట మార్కెట్‌లో జాక్ పాట్ విధానంతో వేలం నిర్వహిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దుచేస్తామని మార్కెట్ యార్డు సెక్రటరీ అభిలాష్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టమోట యార్డు కార్యాలయంలో మండీ యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంతంగా టమోటాలను తీసుకొచ్చే రైతుల నుంచి గంపలు, క్రేట్లకు బాడుగ వసూలు చేయరాదన్నారు. వేలం పాటల్లో పలికిన ధరల కన్నా, వ్యాపారులు చీటీల్లో తక్కువ ధరలు మార్చి బిల్లులు ఇచ్చినా, రైతులు ఫిర్యాదు చేసినా ట్రేడర్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి ఉదయం 7గంటలకే వేలం ప్రారంభిస్తామని, కోలారు, చింతామణి మార్కెట్‌లలో రైతులు వారి పొలం వద్దే క్రేట్లలో నాణ్యత ఆధారంగా టమోటలను గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలన్నారు. వేలం పాటల సందర్భంగా కొంత మంది యూ ట్యూబ్, ఫేస్‌బుక్‌లలో లైవ్‌లు పెట్టడంతో తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, వీటిని యార్డులోకి అనుమతించ వద్దని సెక్రటరీని కోరారు. మండీలకు వచ్చే రైతులు తమ క్రేట్లను తీసుకుంటే వాటికి ఒక్కొక్కటికి రూ.5 చొప్పున అద్దె, కూలీ రూ.3 వసూలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్యారేజాన్, అధ్యక్షుడు సురేంద్ర, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరికి రైతులు వినతులు సమర్పించారు. పోతబోలు రైతు నరసింహులు తమ భూమిపై కోర్టులో కేసు నడుస్తున్నా రెవెన్యూ సర్వేయర్, తాలుకా పోలీసులు బలవంతంగా సర్వే చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీటీఎం ఎంపీపీ రెడ్డెమ్మ, తన భర్త వెలుగు చంద్ర సీటీఎం క్రాస్‌లో తనకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలో నిర్మాణాలు చేపట్టి వైన్‌షాపులకు అద్దెకు ఇచ్చామని, అప్పు చేసి నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు అక్రమాలు అంటూ తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించేది పేదలకు మాత్రమేనని, నివాసం ఉండడానికే తప్ప కమర్షియల్‌గా వైన్‌షాపుల ఇవ్వడానికి కాదని తెలిపారు. రూ.30 లక్షలు ఖర్చు చేసిన వ్యక్తి పేదవాడు ఎలా అవుతాడని ఆయన ప్రశ్నించారు. సర్వే చేసి తెలియజేస్తామన్నారు. పేదలు పేరిటా అక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. జీఓ నెంబరు 30 ప్రకారం పేదలకు 100 గజాలు స్థలం ఇవ్వడానికి ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ధనంజయులు, రెవెన్యూ వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారు వైఖరిపై వీఆర్‌ఏల నిరసన


నిరసన తెలుపుతున్న వీఆర్‌లు

పీలేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు తమ పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారంటూ మండల వీఆర్‌ఏలు శుక్రవారం నిరసన వ్యక్తం చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన సంఘ అధ్యక్షుడు రత్నశేఖర్ మాట్లాడుతూ 'వీఆర్‌ఏలు తెల్లదుస్తులు వేసుకుని ఆఫీసుకు వచ్చి వెళుతుంటారే తప్ప పనులు చేయడం లేదని, ఆఫీసుకు కొంచెం కూడా ఉపయోగం లేదు' అంటూ హేళనగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిత్యం క్షేత్రస్థాయిలో ఉంటూ రెవెన్యూ అధికారులకు సహాయకారిగా ఉంటున్నామని, ప్రభుత్వ పథకాల అమలుకు రేయింబగలూ కష్టపడుతున్నామన్నారు. కేవలం తమ బట్టలను చూసి తమను హేళనగా మాట్లాడడం తహసీల్దారుకు తగదన్నారు. వీఆర్‌ఏలు నాగరాజ, ధనలక్ష్మీ, మాధవి, ఆంజనేయులు, మురళీ, నాగేంద్ర, వాసు, హరినాథ్, మదార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వాళీశ్వరస్వామి రథోత్సవం


వాళీశ్వరస్వామి రథోత్సవంలో కిక్కిరిసిన భక్తులు

రామసముద్రం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాళీశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి శివనామస్మరణతో మార్మోగింది.

యాళి వాహనంపై సిద్ధేశ్వరుడు...

కలకడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నది తీరాన ఆలయంలో వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు యాళి వాహనంపై గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు విహరించారు. రెడ్డిసంఘం ఆధ్వర్యంలో పుష్పాలతో అలంకరించిన ప్రభలతో కూడిన వాహనంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. మంగళవాయిద్యాలు, నెల్లూరు కోలాటాలు, బాణసంచా పేల్చుతూ ఊరేగింపు సాగింది. ఆలయం వద్ద నుంచి ఎర్రయ్యగారిపల్లె మీదుగా కలకడ వీధుల్లో వేడుకగా ఊరేగింపు కొనసాగింది. ఆలయం వద్ద తరపున అన్నదానం చేశారు. ధర్మకర్త రవీంద్రశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో ఊంజల్ సేవ


ఊంజల్ సేవ చేస్తున్న దృశ్యం

కలికిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పురాతన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. శివరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు పార్వతీదేవి, సోమేశ్వరస్వామికి ప్రత్యేక సేవను నిర్వహించారు. అమ్మవారితో కలిసి సోమేశ్వరస్వామి ఊయలలో విశ్రమించారు. ఆలయ నిర్వాహకులు పుల్లా రెడ్డి, అర్చకులు రామచంద్ర శాస్త్రి, శివకుమార్ శాస్త్రి ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను కల్పించారు.

అంకితభావం ఆయన నైజం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో విధులు నిర్వర్తించేవారని, చిరుద్యోగిగా మొదలైన ఆయన పరిపాలనాధికారిగా ఉద్యోగ విరమణ చెందడం ఆయన విధి నిర్వహణకు అద్దం పడుతోందని వక్తలు అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి పెద్దతిప్పసముద్రం మండలానికి ఏఓగా బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించారు. 38 ఏళ్లగా ప్రజలకు సేవలు అందించడం అదృష్టమన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, వెలుగు ఏపీఎం హరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఉపాధి ఏపీఓ తిరుపాలప్ప సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన శ్రీరామ్‌చినబాబు


కలెక్టర్ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిశారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన ఆయనను కలిసి తహసీల్దార్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధ అంశాలపై కొంత సేపు చర్చించారు.

కబ్జా కోరల్లో మురాద్‌బీకుంట

కుంటపై కన్నేసిన రియల్టర్స్ ● సాగుకు సిద్ధం చేసిన అక్రమణదారులు



గుర్రంకొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రియల్టర్స్, ఆక్రమణదారుల చేతుల్లో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు చిక్కుకున్నాయి. దీంతో విలువైన భూములు అన్యాక్రాంతమై కబ్జా కబంధ హస్తాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. వీరి ధనదాహానికి కుంటలు, వంకలు సైతం విలవిల్లాడుతున్నాయి. కుంటలు, వంకలను ఆక్రమించిన రియల్టర్స్ ప్లాట్లు వేసి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. కుంట, వంక స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంపై పలువిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మురాద్‌బీకుంట ఆక్రమణపై స్థానిక ప్రజలు, రైతులు ఆందళోన చెందుతున్నారు. వివరాల్లోకెళితే....

కంద్రిగ రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నెంబరు 16/1లో 3.34 ఎకరాల్లో మురాద్‌బీకుంట ఉంది. ఈ కుంటకు నీరు చేరడానికి రెండు వంకలున్నాయి. సర్వే నెంబరు 503/8లో 1.01 ఎకరాల్లో ఒక వంక ఉంది. ఈ వంక కడప-బెంగుళూరు జాతీయ రహదారి గుండా మురాద్‌బీ కుంటలో కలుస్తుంది. ఈ ప్రాం తంలో సెంటు స్థలం రూ.5 లక్షలు పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన రియల్టర్స్ వంకను పూడ్చి చదును చేశారు. ప్రస్తుతం ఈ వంక స్థలంలో ప్లాట్లు వేయడంతో వర్షం కురిస్తే కుంట కు నీరు చేరే మార్గం లేదు. మరో పక్క కొందరు కుంటలో వ్యవసాయం చేసుకుంటూ రోజు రోజుకూ సాగుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. రియల్టర్స్ వంకలు, వాగులు, డీకేటీ భూములను అక్రమించుకున్ని లక్షలు గడిస్తున్నారు. రియల్టర్స్ అక్రమించుకున్న వంక స్థలమే సుమారు రూ.50 లక్షల విలువ చేస్తుందని ప్రజల్లో చర్చ.

కుంటకు ట్రెంచ్ ఎక్కడ...?

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలో చిక్కుకున్న మురాద్‌బీ కుంటకు పూర్తి స్థాయిలో మోక్షం కలగలేదు. కుంట ఆక్రమణలపై ఏడాది కిందట కంద్రిగ గ్రామస్థులు కలెక్ట ర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు కుంట పూర్తి విస్తీర్ణాన్ని సర్వే చేయించారు. ఈ క్రమంలో కుంట అక్రమణలకు గురైె నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి చుట్టూ ట్రెంచ్ తీయిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఎక్స్‌కవేటర్‌తో కుంట చుట్టూ ట్రెంచ్ ప్రారంభించారు. ఈ ట్రెంచ్‌ను కూడా ఓ వైపు మాత్రమే చేసి మిగిలిన వైపు వది లేశారు. దీంతో కుంట అక్రమణలను పూర్తి స్థాయిలో ట్రెంచ్ తీయించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


అక్రమణల వైపు ట్రెంచ్ తవ్విస్తున్న దృశ్యం(ఫైల్‌ఫొటో)

ఆక్రమణలను తొలగిస్తాం



మురాద్‌బీకుంట ఆక్రమణలను గుర్తించి తొలగిస్తాం. కుంటకు నీరు వచ్చే వంకను పూర్తి సర్వే చేయించి ప్రభుత్వ ఆస్తిగా బోర్డును ఏర్పాటు చేశాం. ఆక్రమణ దారులు కుంటలు, వంకలను ఆక్రమించకుండా తగు చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ


వ్యవసాయం కోసం దున్నిన కుంట

సైన్సుతోనే దేశ ప్రగతి సాధ్యం

జాతీయ సైన్సు దినోత్సవంలో సీనియర్ సైంటిస్టు డాక్టర్ దీప

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సైన్సుతోనే దేశ ప్రగతి సాధ్యమని సీనియర్ సైంటిస్టు డాక్టర్ దీప అన్నారు. శుక్రవారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సైన్సు దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ భారత భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ జయంతి సందర్భంగా సైన్సు దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. 25 ఏళ్లగా సైన్సు ప్రయోగాల్లో సాధిస్తున్న ఫలితాలతో భారతదేశం అగ్రరాజ్యాలతో పోటీ పడుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, బయలాజికల్ సైన్సు హెచ్ఓడీ రమ్య పాల్గొన్నారు. స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు సైన్సుతో ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలన్నారు. అధ్యాపకులు శ్రీనివాసులు, శైలజ, చిన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీలోని ఓ ప్రైవేటుస్కూల్లో నిర్వహించిన సైన్సు దినోత్సవంలో మూడో తరగతి విద్యార్థిని ఘనవి ఉత్తమ సైన్సు ప్రదర్శన ఇచ్చి ప్రథమ బహుమతి అందుకున్నారు. ప్రిన్సిపాల్ సాబ్జాన్, వైస్‌ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో కోలాహలంగా...

పీలేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం పండుగ వాతావరణంలో కోలాహలంగా జరిగింది. గణితం, సైన్స్ సబ్జెక్టులంటే భయపడే విద్యార్థులు ఇటీవల బోధనా పద్ధతుల్లో వచ్చిన మార్పుల కారణంగా సైన్స్ దినోత్సవాన్ని పండుగలా చేసుకుంటున్నారన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సైన్స్‌లోని పలు అంశాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వీఎస్ఎన్ సిద్దార్థ, భువన విద్యాలయం, ఏవీఆర్, ఇండియన్ బీచ్ ట్రీ పాఠశాలల్లోనూ ఎగ్జిబిషన్ నిర్వహించి ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అయ్య ప్పరెడ్డి కాలనీలో జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్‌కు నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్లు ఉమా రమాదేవి, గుణలక్ష్మీ, మాధవి, భార్గవి, హెచ్ఓ సుకుమార్ రెడ్డి, సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లావణ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నూతన పరిశోధనలు చేపట్టాలి

కురబలకోట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన పరిశోధనలు చేపట్టి దేశాభివృద్ధికి పాటుపడాలని మిట్స్ వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా పేర్కొన్నారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్వం డిగ్రీ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. విశ్వం ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ఎంఈఓ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సోలార్ విద్యుత్, సోలార్ ఫెన్సింగ్, గుండె, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై నమూనాలను ప్రదర్శించారు. నాలుగో తరగతి చిన్నారులు సాయి సుజన, సుప్రియ, అల్ఫిహ, చక్రధర్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది.

సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మేళ్లచెరువు పంచాయతీ ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు సమష్టి కృషి చేస్తారని పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు అన్నారు. మేళ్లచెరువు ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆయన నేతృత్వంలో సివిల్ రైట్స్ డేలో భాగంగా తమ కాలనీలో ఉన్న 50 ఇళ్లు శిథిలావస్థకు చేరుకుని వర్షానికి ఉరుస్తున్నాయని, వాటి స్థానంలో తమకు కొత్త ఇళ్లు కేటాయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, తమ కాలనీకి నీరందించే పైపులైన్ మరమ్మతులకు గురైందని, వేసవిని దృష్టిలో పెట్టుకుని బాగు చేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యలపై స్పందించిన తహసీల్దారు అప్పటికప్పుడు హౌసింగ్ డీఈ రమణయ్యతో కలిసి వారి ఇళ్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్నట్లు నిర్ధారించుకుని వాటి స్థానంలో కొత్త ఇళ్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి, ఎంపీడీఓ శివశంకర్, హౌసింగ్ డీఈ రమణయ్య, ఏఓ రమాదేవి, ఏపీఓ అశోక్, పశువైద్యాధికారి వెంకటరమణా రెడ్డి, వీఆర్వో కదిరప్ప, వెలుగు సీసీ మాసయ్య, ఎస్ఐ బాలకృష్ణ, దళిత సంఘాల నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

బి.కొత్తకోట, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పౌరహక్కులపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అప్పుడే తమ హక్కులపై ప్రశ్నించి న్యాయం పొందగలుగుతారని తహసీల్దార్ అజారుద్దీన్ అన్నారు. శుక్రవారం తుమ్మణంగుట్ట సచివాలయంలో సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. గ్రామస్తులకు సివిల్‌రైట్స్ డే నిర్వహణలోని అంతర్యాన్ని వివరించారు.

బి.కొత్తకోటలో ఘనంగా టైలర్ల దినోత్సవం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ టైలర్ల దినోత్సవాన్ని బి.కొత్తకోటలో ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం పట్టణంలోని టైలర్ల సంఘం ఆధ్వర్యంలో జ్యోతిసర్కిల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి మాట్లాడుతూ సమాజంలో టైలర్ల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరి దైనందిన జీవితం టైలర్లతో ముడిపడి వుంటుందన్నారు. మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు, ఏఓ రమాదేవి, యూనియన్ నేతలు తాజ్‌బాషా, గోవిందు, చిన్నా, శంకర, హరిక్రిష్ణనాయుడు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో టైలర్లు ఐక్యంగా ముందుకెళ్లాలని సంఘ నేతలు అన్నారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. సంఘ నేతలు విఠల, బావా జాన్, రహంతుల్లా, సుబ్బు, సూరి, శ్రీనివాసులు, రామకృష్ణ, అనురాధ, వైశాలి, జ్యోతి, జానకి, ఉషా పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమంగా తరలింపు


డేగాని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు చెరువులు, కుంటల నుంచి మట్టి తరలింపు అప్రతిహతంగా కొనసాగుతోంది. ఎక్స్‌కవేటర్లతో చెరువులో మట్టిని తోడి ట్రాక్టర్లతో తరలించి యజమానులు లబ్ధి పొందుతున్నారు. లేఅవుట్‌లలో గుంతలు పూడ్చడానికి, భవన నిర్మాణాల్లో పునాదులు నింపడానికి యథేచ్ఛగా మట్టి తరలింపు బహిరంగంగా జరుగుతోంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నాయి.

ఘనంగా మహా కుంభాభిషేకం ప్రారంభం


ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం మహా కుంభాభిషేక మహోత్సవం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా లంకరణలు చేశారని మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ తెలిపారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి సూరేగిరిధర్, ప్రవీణ్ పర్యవేక్షించారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ

కలికిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఆదివారం నుంచి సామాజిక తనఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తి రావు పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ తనిఖీ జరుగుతుందన్నారు. అన్ని శాఖలతో కలిసి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సమన్వయ సమావేశం నిర్వహిచనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో కోరారు.

డీకేటీ భూమి రైతుల ఆధిపత్య పోరు


సంపతికోట వాగు నుంచి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సంపతికోట వాగులో ఇసుకను తరలించాలంటే వాగు గట్టుపై ఉన్న రైతులకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 ఏళ్ల కిందట రైతులకు వాగు పైన ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వంలో రైతుల భూములకు రెక్కలొచ్చాయి. వాగులో వర్షపు నీరు ప్రవహించడంతో ఇసుకమేటలు రైతుల పొలాల్లోకి చేరడంతో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన డీ పట్టాలను చూపి ఇది తమ భూమి అంటూ కొందరు రైతులు వైసీపీ నేతలకు విక్రయించడంతో చోటామోటా నేతల అండదండలతో వైసీపీ హయాంలో టీడీపీ నేతలను అటువైపు రానివ్వకుండా ఇసుకతో వ్యాపారం చేసి డబ్బు దండుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గతంలో తాము డబ్బు ఇచ్చి భూములను కొన్నామని ఆ రైతుల భూముల్లో ఉన్న ఇసుక మాకే సొంతమని కొందరు వైసీపీ నేతలు, రైతులు ఇసుకను తరలించరాదని అడ్డుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసకను అందిస్తామని, ప్రభుత్వ అవసరాలకు ఇసుకను తరలించాలన్నా ట్రాక్టర్ యాజమానులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులు కూటమి నేతల ట్రాక్టర్లు వస్తే వారి నుంచి 1000 రూపాయలు చెల్లిస్తేనే ట్రాక్టర్‌లో ఇసుక తీసుకు వెళ్లండి అంటూ వారిలో వారే గొడవ పడుతూ ఆధిపత్య పోరును ప్రదర్శిస్తున్నారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం వాగులోని ఇసుకను తరలించడానికి కొందరు కూటమి నేతలు ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ పనులకు శుక్రవారం తరలిస్తుంటే స్థానిక వైసీపీ నేతలు వెనుక ఉండి సంబంధిత రైతులను ప్రోత్సహించి తమ భూమి కింద ఉన్న వాగులోని ఇసుకను తరలించరాదంటూ అడ్డుకుంటున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ పనులకు తప్ప వేరే పనులకు వాగులో ఇసుకను వినియోగించరాదని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని కూటమి నేతలు కోరుతున్నారు.

శివమాలాధారులు శ్రీశైలం పయనం

కలకడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి శివమాలాధారులు శ్రీశైలంలో కొలువైన మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం ఉదయం బయలు దేరారు. గురుస్వామి వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 41 రోజుల దీక్షలో ఉన్న ఆరుగురు భక్తులు ఝరిలో స్నానాలు చేసి సైకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు ధరించి బయలుదేరారు.

భూ ఆక్రమణపై సర్వే

గుర్రంకొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించినట్లు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 127లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ సిబ్బంది శుక్రవారం సర్వే చేసి అక్రమాలను గుర్తించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అక్రమాలను తొలగిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయ కమిటీ ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. మహిళలు రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, కార్యద ర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, తదితరులు పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

పీలేరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రైవేటు, ప్రభుత్వ రంగంలో 10 జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, చిత్తూరు మార్గంలోని అప్సర కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 1102 మంది జూనియర్ విద్యార్థులు, 1122 మంది సీనియర్లు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీటి, వైద్య వసతి సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక



వాల్మీకిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన డబ్ల్యూపీసీ(వరల్డ్ పవర్ ఛాంపియన్‌షిప్) పోటీల్లో చింతపర్తి మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. 4, 5వ తరగతి విద్యార్థినులు నిహారిక, హర్షిణి జిల్లాస్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చూపి 27న రాయచోటిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికయ్యారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆంగ్ల ఉపాధ్యాయులు శశికళ విద్యార్థినులను అభినందించారు.